## ది. 28-7-2007 శనివారం ఉదయం గం. 10-00 లకు
## జంగారెడ్డిగూడెంలో జరిగే

# మానవ హక్కుల వేదిక పశ్చిమ గోదావరి 2వ జిల్లా మహాసభ,

## "సీ డీ స్సు" ను జయప్రదం చేయండి !

పశ్చిమ గోదావరి జిల్లా పేరు దేశమంతా ఎరుగును. నలభై ఏళ్ళ క్రింద దేశంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన హరిత విప్లవం కేంద్రాలలో ఈ జిల్లా ఒకటి.

హరిత విప్లవం వచ్చింది, మాగాణి ప్రాంతాలలో సంపద పెరిగింది. ఆ తరువాత నీలి విప్లవం వచ్చింది. వరి పొలాల స్థానంలో చేపల చెరువులొచ్చాయి. కొంత మంది చేతులలో సంపద ఇంకా పెరిగింది. ఇది దేశమంతా ఎరుగును గానీ, ఎవ్వరూ ఎరుగని చరిత్ర కూడా ఈ జిల్లాకు ఉంది.

1990లలో ఆదివాసుల తిరుగుబాటుకు ఈ జిల్లా ఒక కేంద్రంగా నిలబడింది. ఆదివాసులకు ప్రత్యేక హక్కులు కల్పించే చట్టాలు అంతకు ముందే చేసారు, ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక పాలనా నియమాలను అంతకు ముందే వ్రాసారు. ఆదివాసుల భూములు ఇతరులు స్వంతం చేసుకొనుటను నిరోధించే చట్టాలు అంతకు ముందే చేసారు. అయితే ఈ చట్టాలు చేసినప్పుడు ఆదివాసులలో చదువుకున్నవారు, ఈ చట్టాలు కల్పించే హక్కులను అర్థంచేసుకోగలవారు చాలా కొద్దిమంది. వారు కొద్దిమందిగా ఉండగానే వాటి అమలు మొదలయింది. జరిగిపోయింది. తరచుగా వారికి అందవలసిన హక్కులను ఇతరులు తీసేసుకున్నారు. వారికి చెందవలసిన వనరులను ఇతరులు స్వంతం చేసేసుకున్నారు. ఇదంతా చట్టబద్ధంగానే జరిగిపోయింది.

1980ల తరువాత రాష్ట్రంలో ఆదివాసులలో ఒక చదువుకున్న వర్గం తయారయింది. చట్టం ప్రకారం తమకు చెందవలసిందేమిటో వారు తెలుసుకున్నారు. అది ఎవరి పరం అయిందో గ్రహించారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు వారికి తోడయ్యాయి. తమకు చెందవలసిన హక్కుల కోసం ఆదివాసీ యువకులలో రాష్ట్ర వ్యాప్తంగా అలజడి మొదలయింది. అది పశ్చిమ గోదావరి ఏజెన్సీలో, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం మండలాలలో ఉద్యమం రూపం దాల్చింది. ప్రత్యేకించి, ఎల్.టి.ఆర్. చట్టం క్రింద తమ తల్లిదండ్రులకు ఏమీ తెలియని రోజులలో జరిగిపోయిన విచారణలన్నీ తిరిగి జరిపించాలని వారు పట్టుబట్టారు. అందరూ మరచిపోయిన 1/70 మళ్ళీ రాజకీయ అజెండా మీదికి వచ్చింది. అయితే ఈ అలజడి మొదలై 15 సంవత్సరాలు కావస్తున్నా న్యాయం ఇంకా జరగలేదు.

కొల్లేరు సరస్సు కూడా పశ్చిమ గోదావరిని చర్చనీయాంశం చేసింది. అప్పుడెప్పుడో అది పెద్ద మంచినీటి సరస్సు. ఎక్కడెక్కడివో పక్షులు అక్కడికి ఆయా సీజన్లలో వచ్చేవన్నదీ నిజమే. కానీ కాలక్రమంలో ఆ సరస్సులోకి నీళ్ళు తెచ్చే ప్రవాహ మార్గాలు దెబ్బతిన్నాయి. పరిశ్రమల కాలుష్యము దెబ్బతీసింది. నీళ్ళు తగ్గిపోయిన సరస్సు భూభాగాన్ని పేదలు జీవనాధారంగా మలుచుకొన్నారు. ప్రభుత్వం వారికి డి-ఫారం పట్టాలు ఇచ్చింది. చేపల వేట కూడా చాలామంది చేయసాగారు. కొన్ని వేల కుటుంబాలకు ఆవాసం అయింది కొల్లేరు సరస్సు.

ఆ సరస్సును పునరుద్ధరించడమే కావాలనుకుంటే ఈ ప్రజల జీవనాన్ని కాపాడుతూ ఆ పనిచేసి ఉండవచ్చు. కానీ కొల్లేరు పునరుద్ధరణ ఆ విధంగా జరుగలేదు. ప్రకృతినే తప్ప అందులో బతుకుతున్న ప్రజలను చూడలేని పర్యావరణవాదులు కోర్టుకెక్కగా చట్టాన్నే తప్ప మనుషులను చూడలేని న్యాయస్థానాలు తీర్పులిచ్చాయి. ప్రకృతినీ, పర్యావరణాన్ని కాపాడేది తనొక్కటే అని భావించే సుప్రీంకోర్టు రంగంలోకి దిగి కొల్లేరును నిర్ధాక్షిణ్యంగా ఖాళీ చేయించింది. బలవంతంగా నిర్వాసితులైన ప్రజలకు పునరావాసం తప్పక ఇస్తానని ఒకటికి రెండుసార్లు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అయితే అది ఇప్పటికీ అమలుకాలేదు.

ఏజన్సీ గిరిజనుల హక్కులు గిరిజనేతరుల ఖబ్జాలో ఉండగా, ఏజెన్సీ వెలుపలి గిరిజన గ్రామాలను ఏజెన్సీలో చేర్చాలన్న ఆందోళనను పట్టించుకునే వారే లేరు. టి. నర్సాపురం మండలంలో అనేక గిరిజన గ్రామాలున్నాయి.

(త్రిప్పిచూడుము)

జీలుగుమిల్లి గ్రామలకూ వీటికి తేడా ఏమీలేదు. అవే భూములే, అవే తెగలే, అదే పరిస్థితే. అయినప్పటికీ ఇవి ఏజెన్సీ గ్రామాలు కావు. ఏజెన్సీ ఆదివాసులకు చట్టం కల్పించే రక్షణ ఈ &రగామల వాసులకు దక్కవు. ఈ గ్రామలను ఏజెన్సీలో కలపాలన్న ఆందోళనకు ఆదరణ కరువయింది. 20 సం॥రాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదన క్రమంగా కనుమరుగయ్యేదేమోగానీ, దాని అమలుకోసం రాష్ట్రంలో ఈ మధ్యనే ఉద్యమం మొదలయింది. పశ్చిమగోదావరి జిల్లా మైదాన ప్రాంతాన గిరిజన గ్రామాలవారూ ఉద్యమంలో భాగం అయ్యారు. అయితే ఉన్న ఏజెన్సీలోనే ఆదివాసుల హక్కులను బతకనివ్వని గిరిజనేతరులు ఏజెన్సీ విస్తరణను సులభంగా జరగనిస్తారా? ఇది దీర్ఘకాల పోరాటమే కాగలదు. ఏజన్సీ బయట నివసిస్తున్న నాయక్ పోడులను ప్రభుత్వం S.T.లుగా గుర్తించటం లేదు.

ఇక పోలవరం గురించి చెప్పవలసిందేమీ లేదు. ఇప్పటికే అభివృద్ధి చెందిన మైదాన ప్రాంతాలకు, పారిశ్రామిక కేంద్రాలకు నీళ్ళివ్వడానికి ఏజెన్సీ 1 1/2 లక్షల జనాభాను బలవంతంగా నిర్వాసితులను చేసే ఈ ప్రాజెక్టును గొప్పవరంగా ఈ జిల్లా మైదాన ప్రాంతాల ప్రజలకు చూపించే ప్రయత్నం చాలాకాలంగా జరుగుతున్నది. అయితే ముంపుకు గురయ్యే ఆదివాసుల ఆవేదనను మైదాన ప్రాంతాలవారూ అర్థంచేసుకోవడమేకాక, నీళ్ళొచ్చేది మైదాన ప్రాంతంలోని మెట్టభూములకు కాదని కొంత గ్రహించారు. ఖమ్మం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల ముంపుకు గురి కాబోయే 9 మండలాల ప్రజలు పోలవరం వద్దని ఆందోళన చేస్తుండగా, భౌతికంగా అడ్డంపడి అందరికీ మార్గదర్శకులయింది పోలవరం మండలం చేగొంతపల్లి ఆదివాసులు. రాష్ట్రప్రభుత్వం ఈ ప్రాజెక్టును చాలా ప్రతిష్ఠాత్మకమైనదిగా భావించి మొండిగా వ్యవహరిస్తున్నది. ఈ పోరాటం చాలా జటిలమయినదని దీనినిబట్టి అర్థమవుతున్నది.

పశ్చిమగోదావరి జిల్లాను ప్రత్యేకమైన ఈ సమాజానికి రాజకీయ సమస్యలేకాక, రాష్ట్రమంతటా, ఆమాట కొస్తే దేశమంతటా ఉన్న ఇతర ఉద్యమాలు, అణచివేత, అసమానతల గురించి మనం నిత్యం వింటున్నాం. ఈ సమస్యలన్నిటికీ **హక్కుల కోణం నుండి స్పందించి బాధితుల తరపున గొంతువిప్పి మాట్లాడుతున్న సంస్థ మానవ హక్కుల వేదిక.** కరపత్రాలద్వారా, వివరమైన ప్రచురణలద్వారా సభలు, ధర్నాలు మొదలైన కార్యక్రమాల ద్వారా ఈ నిరసన స్వరాన్ని ప్రజలవద్దకు తీసుకుపోతున్నది. వాస్తవాలు విడమరచి చెప్తున్నాం. న్యాయాన్యాయాలను విశ్లేషిస్తున్నాం. హక్కుల పక్షాన నిలబడమని ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

అయితే ఈ పని ఎంతచేసినా చాలదు, ఎంతమంది చేసినా చాలదు, అభివృద్ధి జపంచేస్తూ, ప్రజల హక్కులనే కాదు, వారి మనోగతను సహితం దానికి బలిచేయడానికి వెనుకాడని పాలకులు, అసమానతులు కరడుగట్టిన సామాజిక, ఆర్థిక వ్యవస్థ, ఉన్న అవకాశాలనూ ఆధిపత్యాన్ని వాడుకొని మరింత సంపాదించుకోవడానికి అలవాటుపడ్డ పెత్తందారీ వర్గాలు, వీరు కల్పించే అడ్డంకులు అధిగమించాలంటే హక్కుల విలువ తెలిసిన వారందపూ ముందుకు రావాలి.

అందుకే మీ కందరికి ఈ ఆహ్వానం. **జూలై 28వ తేదీన జంగారెడ్డిగూడెంలో** జరిగే **మానవహక్కుల వేదిక, పశ్చిమగోదావరి జిల్లా శాఖ మహాసభలకు అందరూ హాజరయి,** అన్నిరకాల సహాయ సహకారాలు అందించి సభలను జయప్రదం చేయవలసినదిగా కోరుతున్నాం.

## సదస్సు

**తేది : ది. 28-7-2007 శనివారం ఉదయం గం. 10-00 లకు**

**వేదిక : ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, జంగారెడ్డిగూడెం**

ముఖ్య అతిథులు : **శ్రీ బుర్రా రాములు,** H.R.F., రాష్ట్ర అధ్యక్షులు
**శ్రీ డా॥ కె. బాలగోపాల్,** H.R.F., రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
**శ్రీమతి సుధగారు,** అడ్వకేట్, H.R.F., కృష్ణా జిల్లా కన్వీనర్

విశిష్ట అతిథులు : **శ్రీ R. సూర్యారావు,** Rtd. ప్రిన్సిపాల్, సి.ఆర్.రెడ్డి కళాశాల, ఏలూరు.
**శ్రీ అలుగు ఆనందశేఖర్,** కరస్పాండెంట్, ప్రియదర్శిని డిగ్రీ కళాశాల, జంగారెడ్డిగూడెం
**శ్రీ బి. రామారావు,** H.R.F., ప॥ గో॥ జిల్లా అధ్యక్షులు

ఇట్లు,
**మానవ హక్కుల వేదిక (HRF)**
పశ్చిమగోదావరి జిల్లా

ది. 20-7-2007
చింతలపూడి

కృష్ణ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, చింతలపూడి. సెల్ : 9346608074